సాక్షి తిరుపతి
గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,410
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,306

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,700
రిటైల్ వెండి గ్రాము	రూ.71.70

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	33	17
తిరుమల	29	14
గూడూరు	34	19
నగరి	34	18

శివలింగంపై సూర్య కిరణాలు



రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె శివాలయంలోని శివలింగాన్ని బుధవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ప్రతి ఏడాది మహా శివరాత్రి వచ్చే నెలలో సూర్యకిరణాలు శివలింగాన్ని తాకుతాయని ఆలయ పూజారి మునిరాజశర్మ తెలిపారు.

న్యూస్‌రీల్

10,14 తేదీల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కపిలతీర్థంరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 10, 14వ తేదీల్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన శ్రీసిటీలోని డైకిన్ సంస్థలో ఇంజినీర్ ట్రైనీ (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్) ఉద్యోగాలకు, అలాగే 14వ తేదీన బెంగుళూరుకు చెందిన అమెరిగో స్ట్రక్చరల్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఇంజినీర్(సివిల్) ఉద్యోగాలకు ఆయా సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత విభాగాల్లో డిప్లొమో పూర్తి చేసిన వారు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఆయా తేదీల్లో ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 91777 73577 నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సూచనలిస్తున్న డీఈఓ శేఖర్

పిచ్చాటూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్ సూచించారు. బుధవారం సాయంత్రం పిచ్చాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. బైజూస్ కంటెంట్ ద్వారా పాఠాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. 10వ తరగతి పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లో చదువుతున్న ఇంటర్ విద్యార్థునులను బోధన ఎలా ఉందని అడిగారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎంఈఓ హేమమాలిని, హెచ్‌ఎం యుగంధర్ రాజు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు వేగవంతం



రాజశేఖర్‌రెడ్డి, డీపీఓ

తిరుపతి అర్బన్ : పంచాయతీల అభివృద్ధికి, కనీస సౌకర్యాలకు ఆదాయ వనరు ఇంటి పన్నులేనని, పన్ను వసూళ్లను వేగవతం చేయాలని డీపీవో(జిల్లా పంచాయతీ అధికారి)రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి(మార్చి 31కి) 50 రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. ఈలోపు 50శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. మొత్తంగా జిల్లాలో రూ.35.68 కోట్లు వసూలు కావాల్సి ఉందని చెప్పారు. ఇప్పటి వరకు రూ.16.47 కోట్లు మాత్రమే వసూలు అయ్యిందని వివరించారు. 15వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీలకు రూ.27 కోట్లు మంజూరు చేసినప్పటికీ పన్నులు వసూలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయా క్లష్టర్ల పరిధిలో డీఎల్‌పీవోలకు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించామని తెలిపారు. సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి వందశాతం పన్నులు వసూలు చేయాలని పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కాసులు ఇస్తే రికార్డులను తారుమారు చేసి ఏ భూమినైనా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేస్తారనేందుకు తిరుపతిలో వెలుగుచూసిన ఉదంతమే నిదర్శనం. రూ.కోట్ల విలువచేసే భూమికి సంబంధించిన రికార్డుల్లోని రెండు పేజీలు మాయమై.. వాటి స్థానంలో కొత్తగా రెండు పేజీలు వచ్చాయి. ఈ పేజీల చించివేత వెనుక ఓ టీడీపీ నాయకుడి హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారణకు దిగారు.



ఆ రెండు పేజీలు ఏమయ్యాయ్..?

- తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిపరులు
- 1972 డాక్యుమెంట్‌లోని రెండు పేజీలను చించేసి..
- కొత్తగా మరో రెండు పేజీలను అతికించిన వైనం
- రూ.కోట్లు విలువైన భూమికి దొంగ రికార్డులు
- పేపర్ల చించివేత వెనుక ఓ టీడీపీ నేత హస్తం?
- విచారణకు దిగిన అధికారులు
- అధికారులపై వేటు తప్పదా?

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని కొందరు అధికారుల అవినీతి సినిమా విలన్ల స్కెచ్‌లను మించుతోంది. ఏకంగా రికార్డుల్లోని ఒరిజినల్ పేజీలను చించేసి కొత్త పేపర్లను అతికించి రూ.కోట్ల భూములను తారుమారు చేసేశారు. సిబ్బంది కథనం మేరకు... తిరుపతి నగరంలో రూ.కోట్ల విలువైన భూమికి సంబంధించి ఇరు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ వివాదానికి ముఖ్యమైన ఆధారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని 1972 నాటి రికార్డు. ఆ భూమిని కొట్టేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న వ్యక్తి ఈ విషయాన్ని గ్రహించాడు. ఓ టీడీపీ నేత సహకారంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనకు తెలిసిన సిబ్బంది ద్వారా రికార్డులను తారుమారు చేసినట్లు చర్చ సాగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని 1972 నాటి 886 నంబర్ రికార్డులను బయటకు తీసి విలువైన భూమికి సంబంధించిన రెండు పేజీలను చించి వేసినట్లు అధికారులు గుర్తించారు. ఆ రెండు పేజీల స్థానంలో కొత్త పేజీలను అంతికించారు.

బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి...

తన భూమికి సంబంధించిన రికార్డుల కోసం బాధితులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను ఆశ్రయించారు. ఆ రికార్డును పరిశీలించగా.. రెండు పేజీలను చించివేసి కొత్తగా మరో రెండు పేజీలను అతికించినట్లు బయటపడింది. ఆ పేజీల్లో సదరు భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న మరో వర్గానికి చెందిన వారి పేర్లను కూడా చేర్చారు. వారు ఆ భూమిని కొనుగోలు చేసినట్లు రికార్డును తారుమారు చేశారు. ఈ విషయంపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎలా బయటకు తీసుకెళ్లారు?

రెండు పేజీలను చించేశారంటున్న ఆ పుస్తకాన్ని బయట బైండింగ్ వర్క్ చేసే వారి వద్దకు తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఇందులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే కొందరు అధికారుల ప్రమేయం లేకుండా బయటకు తీసుకెళ్లలేరని చర్చా జరుగుతోంది. ఆ రికార్డుల పుస్తకం సుమారు 3 అడుగుల పొడవు, ఒకటిన్నర అడుగు వెడల్పు 5 కిలోల బరువు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు అనంతరం అతికించిన పేజీలను నిఘా అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. పుస్తకంలో ఆ రెండు పేజీలు మాత్రం తాజా కాగితం రంగు ఉన్నట్లు గుర్తించారు. పక్క పేజీల రంగు, ఈ పేజీల రంగు తేడా గమనించారు. పేజీలు చించకుండా ఉంటే.. ఆ పేజీలపై సీరియల్ నంబర్ ఉండాలని, అయితే ఆ నంబర్లు లేవని చెబుతున్నారు. అదే విధంగా పక్క పేజీల్లోని రాతకు, అతికించిన పేజీల్లోని రాతకు తేడా ఉన్నటు గుర్తించి, నిర్ధారణకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

మరిన్ని అక్రమాలు వెలుగులోకి?

రెండు పేజీలను చించివేసిన ఘటన వెలుగులోకి వస్తే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని సిబ్బంది చర్చించుకుంటున్నారు. పేజీలను చించివేసిన విషయం తెలుసుకున్న కొందరు స్థానికులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి తమ భూమి వివరాలు కావాలని అడుగుతున్నట్లు తెలిసింది. తిరుచానూరు–రేణిగుంట మార్గంలో 30 సెంట్ల విస్తీర్ణాన్ని 3.30 ఎకరాలుగా రికార్డులో మార్చినట్లు తిరుపతికి చెందిన వెంకటరెడ్డి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

> **విచారణ జరుగుతోంది**
>
> రికార్డులో పేపర్ మిస్సింగ్‌పై విచారణ జరుగుతోంది. సంబంధితులకు నోటీసులు కూడా ఇచ్చాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం. తప్పు జరిగిందని తేలితే సంబంధించిన వారిపై చర్యలు ఉంటాయి.
>
> – గిరిబాబు, డీఐజీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

తుది దశకు ఈక్రాప్ నమోదు



ప్రసాద్‌రావు, డీఏఓ

తిరుపతి అర్బన్: రైతులు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందాలంటే ఈ–క్రాప్‌తో పాటు ఈకేవైసీ తప్పనిసరని డీఏఓ(జిల్లా వ్యవసాయశాఖ అధికారి) ప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఈ–క్రాప్‌కు సంబంధించి 2,03, 416 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారని తెలిపారు. ఇప్పటి వరకు 1,99,398 ఎకరాల్లోని పంటల వివరాలను ఈ క్రాప్ నమోదు పూర్తి చేశామని పేర్కొన్నారు. మరో 4వేల ఎకరాలు మాత్రమే ఈ క్రాప్ చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. మరో రెండు రోజుల్లో 100 శాతం పూర్తి అవుతుందన్నారు. ఇందుకు వ్యవసాయశాఖ అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. సివిల్ సప్లైస్ అధికారులు వరిధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారని, పదేపదే ఈ క్రాప్ నమోదు 100శాతం పూర్తి చేశారా ? అంటూ సమాచారాన్ని తెలుసుకుంటున్నారని వెల్లడించారు. ఈ క్రాప్ చేస్తేనే వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. 77,758 ఎకరాలకు సంబంధించి ఈకేవైసీ చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు 64,523 ఎకరాలకు సంబంధించి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి అయినట్లు వివరించారు.

నేడు జిల్లాకు పలువురు ప్రముఖులు

తిరుపతి అర్బన్: జిల్లాలో గురువారం పలువురు ప్రముఖులు పర్యటించనున్నారని కలెక్టర్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం రాత్రి తిరుపతి పీఎల్‌ఆర్ కన్వెన్షన్‌లో జరగనున్న ఓ వివాహానికి హాజరు కానున్నారు. రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా గురువారం శ్రీవారిని దర్శించుకోనున్నారు. డిప్యూటీ స్పీకర్ కె.వీరభద్రస్వామి గురువారం తిరుపతికి చేరుకుని, శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.

నాణ్యమైన వైద్య సేవలను అందించాలి



చిన్నారిని పలకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి తుడా : వైద్యులు బాధ్యతాయుతమైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి సూచించారు. తిరుపతి రుయా ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో బుధవారం నిర్వహించిన రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం వార్డులోని బాలల ముందస్తు చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆరోగ్య సంరక్షణను చేపట్టిందన్నారు. లోపాలతో పుట్టిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతీయ గ్రామీణ వైద్య మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్‌బీఎస్‌కే శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు శిక్షణలో మెళకువలను నేర్చుకోవడంపై దృష్టిసారించాలన్నారు. అనంతరం న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. పిల్లలకుఅందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, సెంట్రల్ టీమ్ అడ్వైజర్ డాక్టర్ దీప్తికన్నా, స్టేట్ నోడల్ అధికారి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంతకుమారి, మాస్టర్ ట్రైనర్ ప్రదీప్, డాక్టర్ తారకేశ్వరి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

- వారం రోజుల్లో ప్రక్రియ ప్రారంభం
- 52 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఏర్పాట్లు
- జిల్లాలో 127 కేంద్రాలు



సుమతి

తిరుపతి అర్బన్: రబీ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేసినట్లు సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ వై.సుమతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయశాఖ వందశాతం ఈక్రాప్ పూర్తి చేసిన వెంటనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ క్రాప్ 98 శాతం చేసినట్లు సమాచారం ఉందని చెప్పారు. మరో రెండు రోజుల్లో ఆ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. అనంతరం సోషల్ ఆడిట్‌కు సంబంధించి మరో రెండురోజుల సమయం పడుతుందన్నారు. తరువాత వరిధాన్యం కొనుగోలు మొదలవుతుందన్నారు. మొత్తంగా వారం రోజుల్లో ధాన్యం కొనుగోలుకు 127 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 52 వేల మెట్రిక్ టన్నులు రైతుల నుంచి కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను సంప్రదిస్తే సరిపోతుందన్నారు. రైస్‌మిల్లర్ల వద్దకు రైతులు వెళ్లాల్సిన పనిలేదని తెలియజేశారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామని తెలిపారు. గతేడాది మొదటిరకం వరి ధాన్యానికి క్వింటాల్ రూ.2200, రెండోరకం వరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.2100 ఇచ్చామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత జాప్యం లేకుండా నగదును రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని వివరించారు.

రేపు గంగమ్మ గర్భాలయ శిలాన్యాసం

- తిరుపతి నగరవాసులు తరలిరావాలి
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: వెయ్యేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగి, కలియుగ శ్రీవేంకటేశ్వరస్వామి వారికి స్వయాన తోబుట్టుగా భక్తకోటి పూజలందుకుంటున్న తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం చేపట్టే గర్భాలయ శిలాన్యాసం కార్యక్రమానికి నగర ప్రజలు,భక్తులు తరలిరావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపు నిచ్చారు. ఆలయ పునర్నిర్మాణ పనులను ఆయన బుధవారం పర్యవేక్షించారు. అనంతరం స్థానిక ప్రముఖులతో గంగమ్మ గర్భాలయ శిలాన్యాస కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి ప్రథమ భక్తుడైన అనంతాళ్వార్ అమృత హస్తాలతో ప్రతిష్టించిన అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన అమ్మవారు గంగమ్మ తల్లి అని అన్నారు. దేశంలోనే జానపద ఉత్సవాలు జరుపుకున్న చరిత్ర అమ్మవారి జాతర మహోత్సవని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శాశ్వత రాతి కట్టడంతో ఆలయాన్ని నిర్మించేందుకు రూ.16 కోట్లతో మరో వెయ్యేళ్ల చరిత్రలో నిలిచిపోలా పునర్నిర్మాణం సాగుతోందన్నారు. శుక్రవారం ఉదయం 8.22 నుంచి 9 గంటల మధ్య గర్భాలయ ప్రథమ శిలాన్యాసం రాతి గోపుర నిర్మాణ ప్రారంభం కానుందని తెలిపారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల మధ్య శ్రీగంగమ్మతల్లికి సామూహిక హారతి సమర్పణ ఉంటుందని తెలిపారు. ఇందులో భక్తులందరూ పాల్గొని విజయవంతం చేసి అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని పిలుపు నిచ్చారు. వేద పండితుడడు విభీషణ శర్మ మాట్లాడుతూ గంగానదికి ఎంత పవిత్రత ఉందో తిరుపతి గంగమ్మ తల్లికి అంత పవిత్రత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునికృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



వాహనాలను శుద్ధి చేస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 11వ తేదీ నుంచి జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కార్యక్రమం జరిగింది. ఆలయాన్ని, పూజా సామాగ్రిని శుద్ధి చేసి సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణం చేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

రేణిగుంట: భారతీయ వ్యవసాయ నైపుణ్య మండలి, న్యూఢిల్లీ సహకారంతో తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన యువతకు స్వయం ఉపాధి కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. 18–40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీ, యువకులకు పెరటికోళ్ల పెంపకం, సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు, పుట్టగొడుగుల పెంపకంపై 25 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం తాము ఇచ్చే సర్టిఫికెట్ ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇతర సమాచారం కోసం పెరటికోళ్ల పెంపకానికి సంబంధించి (9121968292), సేంద్రియ పద్ధతిలో కూరగాయల పెంపకం కోసం (9908836684), పుట్టగొడుగుల పెంపకం కోసం (8074006322)నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఇబ్బందుల్లేకుండా 'ఎనీవేర్'

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎనీవేర్ విధానంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ గిరిబాబు తెలిపారు. సాక్షిలో బుధవారం 'ఎనీవేర్ డోంట్ కేర్' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి వివరాలు తెప్పించామని చెప్పారు. మూడు నెలల్లో 691 డాక్యుమెంట్లు వచ్చాయని, వాటిలో 572 డాక్యుమెంట్లను వెంటనే పరిష్కరించామన్నారు. మిగిలిన వాటికి రెండు విడతల్లో అప్రూవల్ ఇచ్చేశామని తెలిపారు. 17 మాత్రమే వివిధ కారణాలతో తిరస్కరించినట్టు చెప్పారు. అవి కూడా మార్టిగేజ్ అయిన వాటికి బ్యాంకు నుంచి ఎన్‌ఓసీ ఇవ్వకపోవడం, వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్లు ఉండడం, సాంకేతిక సమస్యల కారణంగానే తిరస్కరించినట్టు వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



స్విమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



పద్మావతీ వర్సిటీ సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటరావు

తిరుపతి తుడా: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సైబర్ క్రైం ఏఎస్పీ సీహెచ్ విమలకుమారి తెలిపారు. స్విమ్స్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో బుధవారం సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్‌లో అడిగే బ్యాంకు ఖాతాలు, ఏటీఎం పిన్ నంబర్లు వంటివి ఎట్టి పరిస్థితుల్లోను చెప్పకూడదని తెలిపారు. సైబర్ క్రైం బాధితులు సకాలంలో హెల్ప్‌లైన్ నం 1930ను సంప్రదించాలన్నారు. సైబర్ మిత్ర రాష్ట్ర హెల్ప్ లైన్ 9121211100 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మొబైల్ ఎక్కడైనా పోగొట్టుకుంటే 9490617873 వాట్సాప్ నంబర్‌కు వివరాలను పంపిస్తే కనిపెడుతారని పేర్కొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ ఆన్‌లైన్ కొనుగోలు, అమ్మకాలు, ఆఫర్లు, వివిధ అవకాశాల పేర్లతో వచ్చే వాటికి మోసపోకూడదని తెలిపారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, సైబర్ పీస్ ఫౌండేషన్ మేనేజర్ ఐఎల్ నరసింహారావు, సీఐ రామచంద్రారెడ్డి, డాక్టర్ కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

పద్మావతీ మహిళా వర్సిటీలో..

తిరుపతి క్రైం : సైబర్ నెరగాళ్లతో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీలు వెంకటరావు, విమల్ కుమారి తెలిపారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. ఏఎస్పీలు మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్‌లు ఎలా జరుగుతున్నాయి, ఎలా ఎదుర్కోవాలో సోదాహరణంగా వివరించారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, సైబర్ ప్రముఖ నిపుణులు నరసింహారావు, డీఎస్పీలు, సీఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం



తహసీల్దార్‌ను అడ్డుకుంటున్న టీడీపీ కార్యకర్తలు



తహసీల్దార్ కారును అడ్డుకుంటున్న కార్యకర్తలను పక్కకు తొలగిస్తున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి

- విధుల నిర్వహణకు ఆటంకం
- ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఉండకూడదని అడ్డగింత
- ఆగ్రహం వ్యక్తం చేసిన పున్నేపల్లె ఎస్సీకాలనీ వాసులు


ఓజిలి: మండలంలోని పున్నేపల్లె ఎస్సీ కాలనీలో బుధవారం పోలీసుల సమక్షంలోనే తహసీల్దార్ లాజరస్‌పై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణాన్ని అడ్డుకున్నారు. పోలీసుల జోక్యంతో ఆమె కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చింది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. పున్నేపల్లె ఎస్సీ కాలనీలో పంచాయతీ కేటాయించిన స్థలంలో నాడు–నేడు పథకం కింద రూ.16 లక్షలతో అంగన్‌వాడీ భవనం మంజూరైంది. ఈ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతుల విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడే అంగన్‌వాడీ కేంద్రం ఉండాలని అధికారులు నాడు–నేడు పథకం కింద భవనం పనులు ప్రారంభించారు. టీడీపీ నాయకులు ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మించకూడదని, వినాయకుని ఆలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో భవనం నిర్మించే విధంగా ఎస్సీ కాలనీలోని టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పి భవనం నిర్మాణ పనులు కావాలనే అడ్డుకుంటున్నారు. అధికారులు పనులను ప్రారంభించి పిల్లర్ల వరకు పూర్తి చేశారు. ఈ భవనం పక్కనే నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్తలు మైలారి పెంచలయ్య, సుబ్రమణ్యం అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు. తమ ఇంటికి దారి సౌకర్యం ఉన్నా కావాలనే అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు. వాస్తవానికి 70 ఏళ్ల కిందటే ఇళ్ల ప్లాట్లు మంజూరు చేసిన సమయంలో ఉత్తరం పక్కన ఇంటి గుమ్మాలు వచ్చే విధంగా అధికారులు స్థలాలు మంజూరుచేశారు. పంచాయతీ స్థలం ఖాళీగా ఉండడంతో దాన్ని ఆక్రమించుకోవాలన్న ఉద్దేశంతో టీడీపీ కార్యకర్తలు తూర్పు వైపు ప్రహరీ ఏర్పాటు చేసుకున్నారు. తమకు దారి సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జేసీ బాలాజీ అంగన్‌వాడీ భవనం పరిసరాల స్థలాలను సర్వే చేయాలని తహసీల్దార్ లాజరస్‌ను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వో సర్వే నిర్వహించారు. మైలారి పెంచలయ్యతో మాట్లాడుతూ మీ ఇంటికి ఉత్తరం పక్కన దారి ఉందని, దాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. దారి చూపి అధికారులు కార్యాలయానికి వెళ్తుంటే తమకు మూడు అడుగుల స్థలం కావాలంటూ టీడీపీ కార్యకర్తలు తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. పోలీసులు సమక్షంలోనే వాగ్వాదానికి దిగి తహసీల్దార్‌ను అడుగుముందుకు వేయనీయకుండా దౌర్జన్యానికి దిగారు. తహసీల్దార్ వారికి సర్ది చెప్పినా వినలేదు. ఎస్‌ఐ ఆదిలక్ష్మి తహసీల్దార్‌ను కారులో ఎక్కించారు. అయిన టీడీపీ కార్యకర్తలు కారు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఎస్‌ఐ, పోలీసులు వారిని పక్కకు నెట్టివేసి తహసీల్దార్ లాజరస్‌ను సురక్షితంగా పంపారు. ఎస్సీ కాలనీలో మంచి పనులు చేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న పనులను అడ్డుకోవడం తగదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళను వేధించిన కేసులో రిమాండ్

తిరుపతి లీగల్ : ఓ మహిళకు ఫోన్ చేసి వేధించడంతోపాటు అసభ్యకర ఫోటోలు పోస్టు చేసిన కేసులో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నగరిమిట్టకు చెందిన కావేటి ప్రసాద్ అలియాస్ నవీన్‌కు ఈనెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ బుధవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్ 16వ తేదీన తిరుపతి ఎమ్మార్‌పల్లె ఎల్‌బీ నగర్‌లోని ఓ మహిళకు నిందితుడు పలుమార్లు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో పాటు అసభ్యకర ఫోటోలను ఆమె ఫోన్‌కు పంపడంతో ఆమె ఎస్వీయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

వాకింగ్ కాస్త రన్నింగ్ అవుతుంది జాగ్రత్త

- మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లేదు
- టీడీపీ హయాంలోనే అక్రమ దందాలు
- నారాలోకేష్ వ్యాఖ్యలపై పోకల అశోక్‌కుమార్ ఆగ్రహం



తిరుపతి మంగళం : 'జిల్లాలో ప్రశాంతంగా పాదయాత్ర పేరుతో పదిమందితో కలిసి వాకింగ్ చేసుకుని వెళుతున్నావ్, మంత్రి పెద్దిరెడ్డిని, మా ఎమ్మెల్యేలను విమర్శిస్తే వాకింగ్ కాస్త రన్నింగ్ అవుతుంది' జాగ్రత్త అని నారా లోకేష్‌ను టీటీడీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ హెచ్చరించారు. చిత్తూరు జిల్లాలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో మంత్రి పెద్దిరెడ్డితో పాటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై నారాలోకేష్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఓర్వలేకే పెద్దిరెడ్డిపై అవాస్తవ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పంలో 30 ఏళ్ల టీడీపీ జెండాను పెకిలించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదని స్పష్టం చేశారు. చిత్తూరులో ఎమ్మెల్యే భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఎలా ఆరోపిస్తారంటూ మండిపడ్డారు. టీడీపీ హయాంలోనే అక్రమ దందాలు విపరీతంగా జరిగాయని స్పష్టం చేశారు. మీ నాన్న చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఇసుక దందా చేస్తున్న అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మహిళా తహశీల్దార్‌పై జుట్టు పట్టుకుని దాడి చేయలేదా? అని ప్రశ్నించారు. ఇసుక, ఎర్రచందనం, మైన్స్ వంటి దందాల గురించి మీరు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో ఎమ్మెల్యేలు, జన్మభూమి కమిటీ సభ్యులు దోచుకున్నంతగా మరెవ్వరూ దోచుకోలేదన్నారు.

క్రీడా పోటీల్లో దివ్యాంగ ఉద్యోగుల ప్రతిభ



చెస్ పోటీలో తలపడుతున్న దివ్యాంగులు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీల్లో బుధవారం జరిగిన పలు విభాగాల్లో దివ్యాంగ ఉద్యోగులు ప్రతిభ కనబరిచారు. చదరంగం పోటీల్లో బి.అరుణకుమారి విజేతగా నిలవగా, విజయలక్ష్మి రన్నరప్‌గా నిలిచారు. పాక్షిక అంధుల చెస్ పోటీల్లో రెడ్డెప్పరెడ్డి విజేతగా, డి.త్యాగరాజు రన్నరప్‌గా నిలిచారు. చెస్ పోటీల్లో రవికుమార్ విజేతగా, ఎంవీ సత్యం ద్వితీయ స్థానం పొందారు. క్యారమ్స్‌లో మునివెంకట ప్రసన్న విజేత కాగా ఎల్.కుమారి రన్నరప్‌గా నిలిచారు. పురుషుల క్యారమ్స్‌లో చంద్రశేఖర్ విజేత కాగా మధుసూదనశర్మ రెండో స్థానంలో నిలిచారు. క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో చంద్రశేఖర్, శ్రీబాబు విజేతలు కాగా బి.శ్రీకాంత్, డి.శ్రీనివాసులు రన్నర్స్‌గా నిలిచారు. 45సంవత్సరాల లోపు మహిళల పాసింగ్ ది లగేజ్ పోటీల్లో రమాదేవి జట్టు విజయం సాధించింది. ఎం.సునంద జట్టు రెండో స్థానంలో నిలిచింది.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



కృష్ణాపురం అటవీ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న దుంగలు

రేణిగుంట: రేణిగుంట, రైల్వే కోడూరు మండలాల్లో బుధవారం కూంబింగ్ ఆపరేషన్లలో 38 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి సూచనల మేరకు మంగళవారం రాత్రి రెండు టీములుగా కూంబింగ్ నిర్వహించారు. మండలంలోని కృష్ణాపురం బీట్ పరిధిలో బుధవారం ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ బృందం కూంబింగ్ చేస్తుండగా శేషాచలం అడవి చీకిగుట్ట వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకొస్తూ కనిపించారు. పోలీసుల అలికిడిని గమనించి దుంగలను అక్కడే పడేసి పరారయ్యారు. 22 అలాగే బాలపల్లె సెక్షన్ సిద్దిలేటి కోన కంగిమడుగు వద్ద ఎర్రచందనం మోసుకొస్తున్న కొందరు వ్యక్తులు కూంబింగ్ సిబ్బంది టార్చ్‌లైట్లు వేసుకు వస్తుండడాన్ని చూసి దుంగలను పడేసి పరారయ్యారు. అక్కడ మరో 16 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లో పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్ తెలిపారు. కూంబింగ్‌లో పాల్గొన్న టీము సభ్యులను ఎస్పీ చక్రవర్తి అభినందించారు.

రైలు పట్టాలపై మృత దేహం



మృతి చెందిన యువకుడు

గూడూరు: రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుని మృత దేహాన్ని బుధవారం రైల్వే పోలీసులు గుర్తించారు. వెంకటగిరి– నిడిగల్లు మధ్య రైలు పట్టాలపై మృత దేహం పడి ఉండగా, గ్యాంగ్ మెన్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్, రెడ్ కలర్ చెక్స్ ఉన్న షర్టును ధరించి ఉన్నాడు. వయస్సు సుమారు 35 ఏళ్లు ఉండవచ్చు, అతని వద్ద ఎలాంటి ఆదారాలు లభించలేదు. ఈ మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతునికి సంబంధించిన వారు గూడూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జిని మార్చాల్సిందే

- అసమ్మతి వర్గం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి

సత్యవేడు: తెలుగుదేశం పార్టీ సత్యవేడు నియోజవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే హెచ్.హేమలత కుమార్తె హెలన్ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకోవడం లేదని, ఇన్‌చార్జిని మార్చాలని అసమ్మతివర్గ సభ్యులు బహిరంగంగానే డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో నియోజవర్గ స్థాయిలో టీడీపీ అసమ్మతి నాయకులు సమావేశం నిర్వహించారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుందరరామిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పద్మనాభరాజు, స్టేట్ లీగల్ సెల్ సెక్రటరీ రోశయ్య, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాదరాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు గోవిందస్వామి, నాగలాపురం ఎంపీటీసీ ప్రేమ సెల్వకుమార్, సుబ్రమణ్యం రాజు తదితరులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నిజమైన కార్యకర్తలు ఎవరో, దళారులెవరో తెలుసుకోలేక పోతున్నారన్నారు. పార్టీ కోసం పనిచేసే వారిని నియమించాలని కోరారు. పార్టీ నాగలాపురం మండల మాజీ అధ్యక్షుడు భాస్కర్ శెట్టి, నారాయణవనం మాజీ ఎంపీపీ గోవిందస్వామి, కేవీబీపురం మాజీ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి, యాచంద్ర నాయుడు, లోకయ్యరెడ్డి, రాధయ్య, హేమభూషణం, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అధునాతనం.. లెక్కింపు సులభతరం



హుండీలను నూతన భవనానికి తరలిస్తున్న సిబ్బంది

- తిరుమలలో ప్రారంభమైన నూతన పరకామణి భవనం
- రూ. 23 కోట్లతో ఆధునిక టెక్నాలజీతో భవంతి
- డోనర్ సెల్ కూడా ఇక్కడే ఏర్పాటుకు చర్యలు
- జర్మనీ నుంచి యంత్రాలు రాగానే నాణేల లెక్కింపు కూడా..

తిరుమల: తిరుమలలో పుష్కరిణికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో టీటీడీ నూతనంగా నిర్మించిన పరకామణి భవనంలో ఆదివారం నుంచి కానుకల లెక్కింపు ప్రారంభమైంది. బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ అందించిన రూ.23 కోట్ల విరాళంతో అధునాతన సౌకర్యాలతో కూడిన పరకామణి భవనాన్ని నిర్మించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా 2022 సెప్టెంబరు 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ఈ భవనాన్ని ప్రారంభించారు. హుండీ ఆదాయం సరాసరి రోజువారి రూ.3 కోట్లు వస్తుండడంతో లెక్కింపునకు సిబ్బంది, స్థలం కొరత ఉంటోంది. ఒక దశలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి రాత్రి వేళల్లో కూడా లెక్కింపు చేపట్టేవారు. నిత్యం 250 మంది వరకు పరకామణి మండపానికి వెళ్లాల్సి ఉండడం.. అక్కడ స్థల లభ్యత తక్కువగా ఉండడం..క్లోజడ్ సర్క్యూట్ ఉండే ఈ ప్రదేశంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండడంతో డెప్యూటేషన్‌పై పరకామణి విధులకు వచ్చేందుకు టీటీడీ ఉద్యోగులు వెనకడుగు వేసేవారు. కానుకలు లెక్కింపు పూర్తి స్థాయిలో జరగకపోవడం.. నిత్యం 300 వరకు చిల్లర నాణేల మూటలను తరలించడం వంటివి ఇబ్బందికరంగా మారడంతో అన్ని వసతులతో కూడిన పరకామణి మండపాన్ని నిర్మించాలని మూడేళ్ల కిందట టీటీడీ నిర్ణయించింది. అందుకు అనుగుణంగా శ్రీవారి పుష్కరిణికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో రూ.9 కోట్లతో నూతన మండపాన్ని నిర్మించేందుకు 2020 ఆగస్టులో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించింది. భవన నిర్మాణం పూర్తయ్యే సరికి రూ.23 కోట్లు ఖర్చు అయ్యింది.



ఇప్పటి వరకు..

శ్రీవారి ఆలయంలోని ఆనంద నిలయానికి వెనుక ఉన్న మండపంలో కానుకలు లెక్కించేవారు. 153 అడుగులు ఉండే ఈ మండపంలో నోట్ల పరకామణి చేపట్టేవారు. నాణేలను ఆలయానికి ఆగ్నేయ దిశగా ఉన్న 80 అడుగులు పొడవు, 36 అడుగులు ఉండే కల్యాణ మండపంలో లెక్కించేవారు. క్రీశ 1586 విజయనగర సామ్రాజ్య ప్రతినిధి చెన్నప్ప నిర్మించిన ఈ మండపంలోనే నాణేలను లెక్కిస్తున్నారు.

నేడు అధునాతనం..

కొత్త పరకామణి భవనాన్ని 15 వేల అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. కానుకలకు సంబంధించిన అన్ని కేంద్రాలను ఇక్కడే ఏర్పాటు చేశారు. నోట్లతో పాటు బంగారం, వెండి, ఇతర వస్తువుల లెక్కింపు మొత్తం కూడా ఈ భవనంలోనే జరుగనుంది. విశాలమైన భవనం.. నూతన హంగులు ఉండడంతో పరకామణి సులభతరం కానుంది. ఇకపై ఏ రోజు కానుకలు ఆరోజు లెక్కించే వెసులుబాటు లభించనుంది. డోనార్ సెల్‌ను కూడా ఇదే మండపంలో ఏర్పాటు చేయనుండడంతో విరాళాలు ఇచ్చే వారికి కూడా సౌలభ్యం ఏర్పడనుంది. కానుకల లెక్కింపును భక్తులు ప్రత్యక్షంగా వీక్షించే వెసులుబాటు కూడా కల్పించారు.

త్వరలోనే చిల్లర నాణేల లెక్కింపు

నాణేల లెక్కింపునకు సంబంధించి నూతన యంత్రాలు ఇంకా రాకపోవడంతో ప్రస్తుతానికి తిరుపతిలోని పరకామణి మండపంలోనే కొనసాగించనున్నారు. జర్మనీ నుంచి నూతన యంత్రాలు తిరుమలకు చేరుకోగానే నాణేల లెక్కింపును కూడా కొత్త భవనంలో చేపడుతారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు.

పాదయాత్రతో పరువు తీస్తున్న లోకేష్

- చంద్రబాబు ఓ డీసెంట్ కిల్లర్
- ఆయన ఉచ్చులో పవన్
- లోకేష్‌పై పోటీకి సిద్ధం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నారా లోకేష్‌పై పోటీ చేసేందుకు తాను సిద్ధమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఆయన స్వగ్రామం ఊరందూరులో నేటికీ ఒక్క మురుగు కాలువ కూడా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఊరందూరును పురపాలక సంఘంలో చేర్చి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆ పనులను రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని మండి పడ్డారు. ఒక కుటుంబం స్వప్రయోజనాల కోసం గ్రామం అభివృద్ధికి దూరంగా ఉండాలా అని ప్రశ్నించారు. ఆ గ్రామ నీలకంఠేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం కూడా నిర్వహిస్తున్నామన్నారు.

పాదయాత్ర పరువు తీస్తున్న లోకేష్

ఎమ్మెల్యేగా గెలవలేని లోకేష్ 151 సీట్లు గెలిచిన సీఎం జగన్‌పై విమర్శలు చేసే హక్కు లేదని ఎమ్మెల్యే మధు మండిపడ్డారు. రాజకీయాల్లో అనుభవం, అర్హత లేని లోకేష్ పెయిడ్ ఆర్టిస్టులతో కలిసి పాదయాత్ర పరువు తీస్తున్నారని విమర్శించారు. పాదయాత్ర కోసం మూడు నెలలు శిక్షణ తీసుకున్నా ప్రజల్లో ఇమడలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. నడవలేని రోజు పోలీసులతో గొడవపెట్టుకుని చిన్నపిల్లవాడిలా పాదయాత్ర దూరాన్ని తగ్గించుకుంటున్నారన్నారు. లోకేష్ పాదయాత్ర సోషల్ మీడియాలో హాస్య పర్వంగా కొనసాగుతోందని తెలిపారు. లోకేష్ ప్రసంగాలు చూసి చంద్రబాబు తలలు పట్టుకుంటున్నారని తెలిపారు.

బాగుపడినట్లు చరిత్రలో లేదు

చంద్రబాబునాయుడు ఓ డీసెంట్ కిల్లర్ అని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబునాయుడుతో నడిచిన నేతలు బాగుపడినట్లు చరిత్రలో లేదని విమర్శించారు. వెన్నుపోటు పొడిచి లాక్కున పార్టీతో ప్రజల్లో నుంచి పుట్టిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పోటీ పడేందుకు నానా తంటాలు పడుతున్నారని ఆరోపించారు.

విద్య కోసమే ఏటా రూ.30వేల కోట్లు

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య కోసం చేస్తున్న ఖర్చును భావితరాల భవిత కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం మానవవనరులపై పెడుతున్న పెట్టుబడిగా భావిస్తున్నారని తెలిపారు. విద్య కోసమే ఏటా రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా 2018–19లో 37.20 లక్షలుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, 2021–22లో 44.29 లక్షలకు పెరిగిందని ఎమ్మెల్యే వివరించారు.

కుష్ఠు రహిత జిల్లాగా తిరుపతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

- ప్రారంభ దశలో గుర్తిస్తే నివారణ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి

తిరుపతి తుడా : కుష్ఠు రహిత జిల్లాగా తిరుపతిని ఆవిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం నుంచి కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. నగరంలోని జ్యోతి లెప్రసీ కాలనీలో కుష్ఠు వ్యాధిపై అవగాహన, చికిత్స కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనికి హాజరైన డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ బహుళ ఔషధ చికిత్సలతో వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యం కాదని తెలిపారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో చికిత్స అందించే చర్యలు జరుగుతున్నాయన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. స్పర్శ లేని మచ్చలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం 94 మంది బాధితులకు రిటైర్డ్ పీవోడీటీటీ డాక్టర్ హంసవర్ధిని దుప్పట్లు, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కుష్ఠు, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ జిల్లా అధికారి డాక్టర్ అరుణ సులోచన, మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు హీనా, ఇతర వైద్యాధికారులు డాక్టర్ మధుబాబు, డాక్టర్ హేమంత్, ఫిజియోథెరపిస్ట్ రమణ, తదితరులు పాల్గొన్నారు.